క్లుప్తంగా

ఆదిత్య కళాశాల ప్రొఫెసర్‌కు డాక్టరేట్


ఆరిఫ్ మహమ్మద్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ప్రొఫెసర్ షేక్ ఆరిఫ్ మహమ్మద్‌కు డాక్టరేట్ లభించినట్టు శుక్రవారం డిప్యూటీ ప్రో.చాన్సలర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రొఫెసర్ ఫయాజ్ అహ్మద్ పర్యవేక్షణలో ఆరిఫ్ మహమ్మద్ సమర్పించిన ఇంపాక్ట్ ఆఫ్ గ్రీన్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ఆన్ కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ పెర్ఫార్మెన్స్ ఇన్వెస్టిగేటింగ్ ది రోల్ ఆఫ్ ప్రో.ఎన్విరాన్‌మెంటల్ బిహేవియర్ శీర్షికకు సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కాశ్మీర్ నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పీహెచ్‌డీ పట్టా పొందినట్టు తెలియజేశారు. ఆదిత్య బిజినెస్ స్కూల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న ఆరిఫ్ మహమ్మద్‌కు యూనివర్సిటీ చాన్సలర్ ఎన్.శేషారెడ్డి, ప్రో చాన్సలర్ సతీష్‌రెడ్డి, వైస్ ఛాన్సలర్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ సురేష్, తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ముగిసిన ఐడీఎస్ఎస్‌సీ క్యాంపు


ప్రో.చాన్సలర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కమాండింగ్ ఆఫీసర్స్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో పది రోజులుగా నిర్వహిస్తున్న ఏటీసీ 2, ఐడీఎస్ఎస్‌సీ క్యాంపు విజయవంతంగా ముగిసినట్టు డిప్యూటీ ప్రో.చాన్సలర్ శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ క్యాంపునకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 600 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారని తెలిపారు. శ్రీ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ హెచ్.ఎస్ మాణిక్, సుబేదార్ మేజర్ గులాబ్ సింగ్, శ్రీనివాసరెడ్డికి జ్ఞాపికను అందజేశారు.

ఎయిడ్స్‌పై కళాజాతా


లింగంపర్తిలో కళాజాతా నిర్వహిస్తున్న కళాకారులు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తి గ్రామంలో శుక్రవారం ఎయిడ్స్‌పై అవగాహన కొరకు కళాజాతా నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ, సాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జానపద కళాజాతా చేపట్టారు. ఎయిడ్స్ దీర్ఘకాలిక వ్యాధి అయినా మందుల వాడకం ద్వారా అదుపు చేయవచ్చాన్నారు. ఎయిడ్స్‌కు మందులతో నివారణ పొందవచ్చన్నారు. వ్యాధి వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ కౌన్సిలర్ రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎసత్యనారాయణమూర్తి స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం యోగాంధ్ర ప్రచారంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ యోగాతో అన్ని రోగాలను నివారించవచ్చన్నారు. మానవ జీవితంతో యోగా దైనందిక కార్యక్రమంగా భావించాలన్నారు. మారుతున్న కాలంతో పాటు ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ


కీర్తి వర్షిణి


రావాడ చేతన్

కోటనందూరు: సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. విద్యార్థులు ఏప్రిల్‌లో పరీక్ష రాయగా శుక్రవారం ఫలితాలు వెలువడ్డాయి. మండలంలో కేఏ మల్లవరం ఎంపీ యూపీ స్కూల్లో ఐదవ తరగతి చదువుతున్న రావాడ చేతన్ 236/300, కోటనందూరు హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న కీర్తి వర్షిణి 232/400 మార్కులు సాధించారు. ఈ మేరకు వీరిద్దరికీ సైనిక్ పాఠశాలలో సీటు వచ్చే అవకాశం ఉందని కోచింగ్ ఇచ్చిన ఏపీఎం అధినేత అల్లు విష్ణుమూర్తి తెలిపారు. విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

అడ్డుకొండలో భూమి పోరు

- 575 ఎకరాలు.. రెండు వర్గాలు.. ఆధిపత్య పోరులో గెలుపెవరిదో..?
- మొత్తం భూమిని పేదలకు పంచాలంటున్న రైతు కూలీ సంఘం
- 175 ఎకరాలు తమదే అంటున్న ఏలేటి కుటుంబం
- పరిశ్రమల ఏర్పాటుకు ఎమ్మెల్యే సన్నాహాలు


అడ్డుకొండ భూమిలో మామిడి ఫలసాయంపై ఏర్పడిన వివాదం పరిష్కరించేందుకు వచ్చిన రెవెన్యూ, పోలీసు అధికారులు (ఫైల్)

జగ్గంపేట: మండలంలోని మల్లిసాల, గండేపల్లి మండలం గోపాలపురం సరిహద్దుల్లో సర్వే నంబర్ 353లో 575 ఎకరాల అడ్డుకొండ భూమి వివాదం మళ్లీ మొదలైంది. దీనిపై ఆధిపత్యం కోసం ఆయా వర్గాలు వివాదానికి దిగుతున్నాయి. ఈ నెల 21న అడ్డుకొండ భూమిలో వచ్చిన మామిడి ఫలసాయాన్ని తీసుకునే విషయంలో రైతు కూలీ సంఘం, భూస్వామికి మధ్య పెద్ద వివాదం చోటు చేసుకుంది. దీనితో రెవెన్యూ, పోలీసులు రంగప్రవేశం చేసి, మామిడి ఫలసాయాన్ని వేలం వేసి, ఉద్రిక్త పరిస్థితులను తాత్కాలికంగా చక్కదిద్దారు. కొంత మంది కూటమి నేతలు కొంత ఫలసాయాన్ని పక్కదారి పట్టించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అడ్డుకొండ భూమిలో సుమారు 400 ఎకరాలు కొండ ప్రాంతం కాగా, మరో 175 ఎకరాల్లో మామిడి, జీడిమామిడి తోటలున్నాయి. వాటి ద్వారా ఏటా రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల విలువ కలిగిన ఫలసాయం వస్తున్నట్లు తెలుస్తోంది. 175 ఎకరాల భూమిపై పూర్తి హక్కులు తమవేనని యేలేటి పద్మరాజు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ భూముల్లో మామిడి, జీడిమామిడి తోటలను తమ పూర్వీకులు సాగు చేశారని యేలేటి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అడ్డుకొండ భూమి మొత్తం ప్రభుత్వ పోరంబోకు అని, సామర్లకోటకు చెందిన భూస్వామి యేలేటి పద్దరాజు దీన్ని ఆక్రమించుకుని గతంలో తప్పుడు రికార్డులు సృష్టించారని రైతు కూలీ సంఘం ఆరోపిస్తోంది. భూస్వామి కుటుంబానికి వ్యతిరేకంగా 40 ఏళ్లుగా పోరాటాలు చేసి విజయం సాధించామని చెబుతోంది.

ఈ సమస్య ఇలా ఉండగా.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అడ్డుకొండ భూమి ప్రభుత్వానిది కాబట్టి, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల హబ్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు పలువురు చెబుతున్నారు. పరిశ్రమలు వస్తే నియోజకవర్గంలోని యువతకు ఉపాధి కలగడంతో పాటు, రైతులకు మేలు జరుగుతుందని అంటున్నారు. దీనితో అడుకొండ భూమి ప్రాధాన్యత మరింత పెరగడంతో పాటు మరిన్ని వివాదాలకు కేంద్రం బిందువుగా మారుతోందా అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

175 ఎకరాలు మావే



1965లో సెటిల్‌మెంట్ ఆఫీసర్ రికార్డు ప్రకారం అడ్డుకొండ భూమిలో 175 ఎకరాలు మా కుటుంబానికే దక్కింది. మా దగ్గర అన్ని రికార్డులు, ఆధారాలు ఉన్నాయి. హైకోర్టు ఉత్తర్వులున్నా రెవెన్యూ అధికారులు, జిల్లా యంత్రాంగం, పోలీసులు మాకు న్యాయం చేయటం లేదు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారు.

– యేలేటి రమేష్ (భూస్వామి పద్మరాజు మనవడు), సామర్లకోట

యేలేటి కుటుంబానికి చెందినది 75 ఎకరాలే..



అడ్డుకొండ భూ వివాదం ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోంది. గతంలో రెవెన్యూ జిల్లా యంత్రాంగం విచారణ చేసి యేలేటి కుటుంబానికి 1965 సెటిల్‌మెంట్ ద్వారా 75 ఎకరాలు మాత్రమే దఖలు పడిందని తెలిపారు. మిగిలిన భూమి అంతా ప్రభుత్వ పోరంబోకు అని రికార్డుల్లో వుంది.

– జేవీఆర్ రమేష్, తహసీల్దార్, జగ్గంపేట

పరిశ్రమలు పెడితే ఊరుకోం



అడ్డుకొండ భూమిలో 75 ఎకరాలు పోను మిగిలిన 500 ఎకరాలు 500 మంది ఎస్సీ, ఎస్టీ, నిరుపేదలకు, ఎకరం చొప్పున పంపిణీ చేయాలి. ఈ భూమిలో కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరిశ్రమలు పెడితో సహించేది లేదు. ఎన్నో పోరాటాలు, నిర్బంధాలు ఎదుర్కొని ఈ భూమిని సాధించుకున్నాం.

– కర్నాకుల వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి, రైతు కూలీ సంఘం, జగ్గంపేట

బూటకపు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలి


రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్

గోకవరం: ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఈనెల 21న మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు మరో 28 మందిపై జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అటవీ సంపదను, సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగారు పేరుతో మధ్య భారత అడవుల్లో ఆదివాసులను బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో హత్యలు చేస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టు పార్టీ శాంతి చర్చలు జరపాలని అనేక మార్లు ప్రకటనలు చేస్తున్నప్పటికీ బిజెపి ప్రభుత్వం నియంతల వ్యవహరిస్తూ కనీసం స్పందించకపోవడం చూస్తుంటే దేశంలో ప్రత్యామ్నాయ శక్తులను లేకుండా చేయడంలో భాగమని విమర్శించారు. ఆదివాసుల, మావోయిస్టుల హత్యలకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగారుని వెంటనే నిలిపివేసి మావోయిస్టు పార్టీతో తక్షణం చర్చలు జరిపి, అడవుల్లో ఉన్న బలగాలను వెనక్కి రప్పించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా గంగాదేవి జాతర


గుమ్మరేగుల శివారు గంగాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రౌతులపూడి: గుమ్మరేగుల శివారు కోళ్ల రవిబాబు వ్యవసాయ క్షేత్రంలో కొలువైన గంగాదేవి జాతర శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ జాతరలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. మంగళవాయిద్యాలు, బాణ సంచా కాల్పులు, డప్పులు, గరగల నృత్యాలతో పాటు, కోలాటం, తప్పెటగుళ్లు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, వైఎస్సార్ సీపీ మండల కమిటీ సభ్యుడు సుర్ల సత్యన్నారాయణ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం 2.గంటలకు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు తెలిపారు. ఎంపీపీ గోర్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో మండలంలోని వివిధ ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టిన పనులపై సమీక్షించనున్నారు. వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావలసిందిగా ఎంపీడీఓ కోరారు.

పేద ప్రజల నోట్లో మట్టికొట్టిన కూటమి

- కార్తకర్తలే వైఎస్సార్ సీపీకి వెన్నెముక
- వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు


వైఎస్సార్ సీపీ నాయకులతో మాట్లాడుతున్న కో–ఆర్డినేటర్ గిరిబాబు

రౌతులపూడి: కార్తకర్తలే వైఎస్సార్ సీపీకి వెన్నెముక అని ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని పల్లపు చామవరంలో ఓ ప్రయివేట్ కార్యక్రమానికి హాజరైన ఆయన ముందుగా గ్రామంలో వివిధ దేవతా మూర్తులను దర్శించుకున్నారు. అనంతరం స్థానిక ఎస్సీ పేటలోవున్న రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ నేత బండారు ఏసుబాబు స్వగృహంలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఇటీవల పార్టీలో సంస్థాగతంగా ఎన్నికైన మండల పార్టీ శ్రేణులంతా ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని పార్టీ అభివృద్ధిపై నాయకులు, కార్యకర్తలతో ఆయన సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయినా ఇచ్చిన హామీలకు మంగళం పాడి పేదప్రజల నోట్లో మట్టికొట్టారని మండిపడ్డారు. ప్రభుత్వం అవలింబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త మీద ఉందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో పర్యటించి పార్టీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఎన్నికలు ఎపుడొచ్చినా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుని తిరిగి రాజన్న రాజ్యాన్ని తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, అంగూరి లక్ష్మీశివకుమారి, పార్టీ నేతలు వాసిరెడ్డి జమీలు, భాస్కరబాబు, మండల పార్టీ కన్వీనర్ సత్యన్నారాయణ, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర బీసీ విభాగం అధికార ప్రతినిధి గొల్లు వెంకటరమణ, నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షుడు సర్పం శ్రీను, ఎస్టీ విభాగం అధ్యక్షుడు చెన్నాడ సత్తిబాబు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్క్యులర్ అమలుపై హర్షం


ఏలేశ్వరం ఆర్టీసీ డిపో వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఏలేశ్వరం: ప్రభుత్వం సానుకూలంగా స్పందించి 1/2019 సర్క్యులర్ అమలుకు ముందుకు రావడంపై శుక్రవారం ఆర్టీసీ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో గేట్‌వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ యూనియన్ తరపున 1/2009పై తమ పోరాటం చేసి విజయం సాధించామన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

ఎన్ఎమ్‌యూ హర్షం

గోకవరం: ఏపీఎస్ ఆర్టీసీలో ఉద్యోగుల భద్రత కోసం ప్రవేశపెట్టిన 1/2019 సర్క్యులర్ అమలుకు యాజమాన్యం అంగీకారం తెలపడంపై గోకవరం ఆర్టీసీ డిపోలో ఎన్ఎమ్‌యూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం డిపో గేటు వద్ద నిర్వహించిన సమావేశంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎన్ఎమ్‌యూ అనేక శాంతియుతమైన పోరాటాలు చేయడంతో ఈ సర్క్యులర్ అమలుకు మేనేజ్‌మెంట్ అంగీకారం తెలిపిందన్నారు. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ పి.వి.రమణారెడ్డి, ఇతర నాయకులు శ్రీనివాస్‌రాజు, అడపా రామారావుల కృషి అన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించినందుకు కార్మికుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని కొనియాడారు. ఈ మేరకు గోకవరం డిపో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ముద్రగడ పరామర్శ


నాగబాబును పరామర్శిస్తున్న ముద్రగడ పద్మనాభం, గిరిబాబు

కిర్లంపూడి: మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు కుమారుడు పృధ్వీఅభికి ఇటీవల ప్రమాదవశాత్తు కాలికి గాయమైంది. దీంతో ఆపరేషన్ చేయడంతో ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. కాగా రాష్ట్ర వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ సభ్యుడు (పీఏసి) ముద్రగడ పద్మనాభం, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు శుక్రవారం నాగబాబు స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట శరకణం భద్రం, మండపాక చలపతి, నక్కా అప్పలరాజు, పెంటకోట శ్రీరాములు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సేవా కార్యకర్తలపై ఏఈఓ దురుసు ప్రవర్తన

షోకాజ్ నోటీసులు జారీ

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో సేవ చేసేందుకు వచ్చిన మంచిర్యాలకు చెందిన మహిళా సేవకుల బృందంపై దురుసుగా ప్రవర్తించినట్లు వచ్చిన ఆరోపణలపై దేవస్థానం ఏఈఓ కే కొండలరావుకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు దేవస్థానం అధికారులు శుక్రవారం తెలిపారు. గురు, శుక్రవారాల్లో ఆ సేవా బృందం మహిళలను విచారించిన అధికారులు, ఈ మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. విచారణ నివేదికను దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపించనున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తను విధుల్లోకి తీసుకోవాలి


శంఖవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వర్కర్లు, హెల్పర్లు

శంఖవరం: రౌతులపూడి మండలం రామకృష్ణాపురంకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తను అక్రమంగా తొలగించడంపై కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. అక్రమంగా తొలగించిన అంగన్‌వాడీ వర్కర్ ఎం.పద్మను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శంఖవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద శుక్రవారం బైఠాయించి, ధర్నా చేపట్టారు. జిల్లా అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్స్ యూనియన్ సభ్యురాలు పద్మ మాట్లాడుతూ ఎటువంటి సమాచారం లేకుండా కార్యకర్తను తొలగించడంపై అనేక అనుమానాలున్నాయన్నారు. సమాచారం కోసం కార్యాలయంలో సంప్రదిస్తే నిరాకరిస్తున్నారని ఆమె ఆరోపించారు. 2020 వరకు పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను కొనసాగించాలంటూ గత ప్రభుత్వం జీఓ విడుదల చేసిందన్నారు. 2023లో టీసీడిగా పేర్కొంటున్న వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే, సీడీపీఓ సదరు జీవో కాపీను ఎందుకు కోర్టుకు సమర్పించలేదని ప్రశ్నించారు. అక్రమంగా తొలగించిన కార్యకర్తను విధుల్లోకి తీసుకోకపోతే జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీడీపీఓ మొండి వైఖరి విడనాడాలంటూ వర్కర్లు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు బి.రత్నకుమారి వర్కర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు దూరం

- కూటమి ప్రభుత్వ విధానాలతో నష్టం
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత


పిఠాపురంలో ఎండీయూ ఆపరేటర్లకు మద్దతుగా ఆందోళన చేస్తున్న వంగా గీత

పిఠాపురం: పేదలకు సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం దూరం చేస్తుందని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మండిపడ్డారు. ఎండీయూ వాహన సేవలను నిలిపి వేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా పిఠాపురంలో శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన ఎండీయూ ఆపరేటర్ల ఆందోళనకు ఆమె మద్దతు పలికారు. వారితో కలిసి నడి రోడ్డుపై నిరసన తెలిపిన ఆమె ఎండీయూ వాహనాల సేవలను నిలిపి వేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ప్రజలకు అందే పలు పథకాలు దూరం చేసిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు చేరువ చేసిన పరిపాలనా వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేయడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. పేద, బడుగు, బలహీన వర్గాలు, ఒంటరి మహిళలు, వృద్ధులు, వితంతువులు ఇలా బయటకు వెళ్ల లేని అనేక మందికి వారి ఇంటికే తీసుకెళ్లి సరకులు అందించే ఎండీయూ వాహనాలను నిలిపివేయడం కక్ష సాధింపు చర్యగా ఆమె అభివర్ణించారు. రేషన్ అందించే వ్యవస్థను నమ్ముకుని సుమారు 19 వేల మంది జీవనోపాధి పొందుతున్నారని, వారందరినీ రోడ్డుకు ఈడ్చితే చూస్తే ఊరుకోమని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, పిఠాపురం పట్టణ, రూరల్, కొత్తపల్లి మండల పార్టీ అధ్యక్షుడు రావుల మాదవరావు, అడపా రఘు, ఆనాల సుదర్శన్, నాయకులు గండేపల్లి బాబీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైక్య ఎండీయూ ఆపరేటర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు సిద్ధాంతపు రవికుమార్, జిల్లా ట్రెజరర్ దైవపాల్, పిఠాపురం మండల అధ్యక్షుడు ఆళ్ల సుబ్రహ్మణ్యం, మండల వైస్ ప్రెసిడెంట్ చాట్ల శ్రీను పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీ ఈఏపీ సెట్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ నందు ఐదు రోజులుగా జరుగుతున్న ఏపీ ఈఏపీ సెట్–2025 ఆన్‌లైన్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగినట్టు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం సెషన్స్‌లో జరిగిన ఈ పరీక్షకు 1,069 మంది విద్యార్థులకు 33 మంది హాజరుకాలేదన్నారు.

బ్యాటరీలు, మోటార్ల చోరీకి పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు


పట్టుబడ్డ వారితో ఎస్సై పవన్ కుమార్, సిబ్బంది

గోకవరం: రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాల్లో బ్యాటరీలు, పొలాల్లో మోటారు ఇంజిన్లు దొంగతనం చేస్తున్న ఇద్దరు వ్యక్తులను గోకవరం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గోకవరానికి చెందిన గుర్రం రాంబాబు, గంటా ధర్మరాజులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నాలుగు బ్యాటరీలు, ఒక మోటారు ఇంజిన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించామన్నారు.

పంచారామ క్షేత్రంలో పూజలు


బీఎస్ఎన్ఎల్ సీజీఎం దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో సౌత్ ఇండియా బీఎస్ఎన్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ పి.మురళీమోహన్ దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చి వారికి అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలోని కాలభైరవస్వామి, ధ్వజస్తంభం, పెద్ద నంది, మూలవిరాట్, ఉప ఆలయాలను దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. సీజీఎం దంపతులకు పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ బళ్ల నీలకంఠం స్వామి వారి ఫోటో, ప్రసాదం ఇచ్చారు. శుక్రవారం ఏకాదశి పర్వదినం కావడంతో ఆలయంలో పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు ఆలయ అన్నదాన ట్రస్టు ద్వారా అన్నప్రసాద వితరణ జరిగింది.

GENERAL PUBLICATION

Under instructions from our client M/s. SHRIRAM FINANCE LIMITED, Registered Office at Chennai Branch Office at Samalkota road, Peddapuram I issue this notice to the General Public.

Our client is intending to advance loan VURADALA VEERABABU S/o. Nageswarao, Sarpavaram Kakinada Rural Mandal Kakinada District of agreed to create equitable mortgage relating to the under mentioned schedule property belongs to them.

The public is hereby informed that if anybody has got any objection in respect of the mortgage of the schedule property, kindly contact under mentioned address within one week. Otherwise, the same is treated as no objection.

SCHEDULE OF THE PROPERTY: Regd. Sale Deed No. 3747/2023 dated 15-07-2023 Present Kakinada District Previously East Godavari District, Gandepalli Mandal, Peddapuram sub registry Surampalem village Panchayat in R.S.No. 79/4 an extent of 216.96 sq.yards or 181.40 sq meters of vacant site having nearer door no 1-191 within the following boundaries with all easement rights.

East: 31.6 feet road. South: 63.6 feet property sold to Joka Bhagyalakshmi. West: 30 feet property donor. North: 63.6 feet Botla Vishnu's land.

Peddapuram Dt: 23-05-2025 T. SATYANARAYANA, B.Com., B.L. ADVOCATE, PEDDAPURAM, Cell: 98856 57091